క్లుప్తంగా

బత్తిలి వాసికి అవార్డు



ప్రొఫెసర్ రమేష్‌బాబు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

భామిని: మండలంలోని బత్తిలికి చెందిన బి.శ్రీనివాసరావుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఫిలాసఫర్ అవార్డు దక్కింది. విజయవాడలోని వైవీ రావ్ సిద్ధార్థ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ భవన్‌లో ఏపీ ఎంఈడీ ప్రాపర్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.రమేష్‌బాబు చేతులమీదుగా శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. ఈమేరకు శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్‌లు శనివారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. గారపాడు జంక్షన్ వద్ద ఎస్సై మస్తాన్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

15లోగా ఫీజులు చెల్లించాలి

గరుగుబిల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాల ఫీజులు ఈ నెల 15వ తేదీలోగా చెల్లించాలని మండల సమన్వయకర్త పి.శ్రీనివాసరావునాయుడు శనివారం తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయా తరగతుల ప్రవేశాలకు అపరాధ రుసుంతో కలిపి 15వ తేదీలోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

15 నుంచి 'గాలికుంటు' టీకాలు

గరుగుబిల్లి: జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో వ్యాక్సినేషన్ చేపడుతున్నట్లు నాగూరు పశువైద్యాధికారి అలజంగి స్రవంతి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. గరుగుబిల్లి, ఉల్లిబద్ర, రావివలస పశు వైద్యశాలల పరిధిలో చేపట్టే వైద్య శిబిరాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్వానంగా గోలుకుప్ప రహదారి



రాళ్లు తేలిన గోలుకుప్ప రహదారి

సీతంపేట: మండలంలోని గోలుకుప్ప గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రామనగరం నుంచి గోలుకుప్ప వరకు కిలోమీటర్ మేర రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అత్యవసర సమయంలో 108 వాహనం కూడా గ్రామానికి రాలేకపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామానికి చెందిన చిరంజీవి, తదితరులు కోరారు.

తిరుగుబాటు మొదలైంది..

- ఆర్థిక బకాయిలు, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయుల పోరుబాట
- రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి బైక్‌జాతా
- ఈ నెల 15 నుంచి 19 వరకు ఐదు ముఖ్య పట్టణాల్లో రణభేరికి రంగం సిద్ధం
- సెప్టెంబర్ 25న విజయవాడలో భారీ బహిరంగ సభ



రణభేరికి సిద్ధమవుతున్న యూటీఎఫ్ నాయకులు

వీరఘట్టం: ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రభుత్వం వచ్చాక విస్మరించారు. దీంతో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు యూటీఎఫ్ రణభేరి మోగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల 15 నుంచి 19 వరకు ముఖ్య పట్టణాల్లో బైక్ జాతాతో రణభేరి చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 25న విజయవాడలో భారీ బహిరంగ సభ ద్వారా ఉపాధ్యాయ సమస్యలను గొంతెత్తి నినదించేందుకు యూటీఎఫ్ కార్యచరణ సిద్ధం చేస్తోంది.

ఈ నెల 15 నుంచి ..

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15 నుంచి 19 వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఐదు ముఖ్య పట్టణాల్లో బైక్‌జాతా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకురానున్నారు.

ఇవీ యూటీఎఫ్ డిమాండ్లు..

- ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలి.
- పాఠశాలల్లో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలి.
- ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు ఇవ్వాలి.
- 12వ పీఆర్సీ ప్రకటించాలి.



యూటీఎఫ్ ఆవిష్కరించిన రణభేరి పోస్టర్

- పీఆర్సీ ప్రకటించే వరకు 29 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి.
- పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలి.
- పేరుకుపోయిన రూ.వేల కోట్ల ఆర్థిక బకాయిలు చెల్లించాలి.
- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి.
- అస్తవ్యస్తంగా పునర్:వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిచేయాలి.

బైక్‌జాతాను విజయవంతం చేయండి..

ఉపాధ్యాయల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బైక్ జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైంది. తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు చేపడుతున్న రణభేరిని విజయవంతం చేయాలి.

చలో విజయవాడకు సిద్ధం కావాలి



ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరిచారు. గతంలో పోరుబాట ద్వారా ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేశాం. ఈ సారి రణభేరి ద్వారా బైక్‌జాతా చేపట్టి ఉపాధ్యాయుల ఐక్యతను చాటి చెబుదాం. అప్పటికీ ప్రభుత్వంలో మార్పు రాకపోతే ఈ నెల 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడతాం. ప్రతి ఒక్కరూ చలో విజయవాడకు సిద్ధం కావాలి.

– ఎస్.మోహనరావు,
యూటీఎఫ్, రాష్ట్ర కార్యదర్శి

సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్

- జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీ నాయుడు, పార్టీ మండల కన్వీనర్ అచ్యుతరావు

గరుగుబిల్లి: కూటమి ప్రభుత్వం అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న సూపర్ సిక్స్ పథకాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని, దానికి పథకాలు అందని ప్రజలే ప్రూఫ్ అని జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావుతో కలిసి విలేకరులతో శనివారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలిచ్చి ప్రజలను ఊదరగొట్టారని, తీరా అధికారంలోకి వచ్చాక అరకొరగా పథకాలు అమలు చేసి జనాన్ని మోసం చేశారన్నారు. ఎన్నికలప్పుడు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అని చెప్పారని, ఇప్పుడు ఏడాదికి మూడు ఇస్తున్నామని చెబుతున్నారని, అలాగే తల్లికి వందనం పేరిట చదువుతున్న ప్రతి బిడ్డ పేరిట రూ.15 వేలు చొప్పున వేస్తామని, రూ.13 వేలు ఇచ్చారని, కొంతమందికి అది కూడా రకరకాలుగా(రూ.13 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు) అందిందన్నారు. అన్నదాత సుఖీభవ కూడా ప్రతిరైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి అందులో సగం కూడా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల వయసు దాటిన ప్రతి మహిళకు ఇస్తామన్న రూ.1500 ఎక్కడని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. అలాగే 50 ఏళ్ల వయసు దాటిన బీసీలకు పెన్షన్ ఇస్తామన్నారు ఎప్పుడిస్తారని నిలదీశారు. ప్రతి పథకంలోనూ అర్హులను మోసం చేస్తూ అనర్హులకు పథకాలు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. మొత్తం 160కి పైగా హామీలిచ్చారని, కనీసం సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలు చేయకుండా అభివృద్ధి పాలనకు ఏడాది పేరిట ఉత్సవాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. ఎప్పుడూ గ్రామాల్లో చూడని మద్యం బెల్టుషాపులు కనిపిస్తున్నాయని, ఇదే కూటమి పాలన వైఫల్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా యూరియా కొరత ఉందని, రైతులు రోడ్డెక్కి నిరసన చేపడుతున్నా ఎవరికీ పట్టడం లేదన్నారు. పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అన్నివర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజావ్యతిరేకత మూటగట్టుకోవడం ఖాయమని జోష్యం చెప్పారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో ఉన్న వినాయకస్వామి ఆలయ అభివృద్ధి కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకులు డి.పారినాయుడు శనివారం తెలిపారు. కమిటీ చైర్మన్‌గా తామాడ సరళ, వైస్ చైర్మన్‌గా మార్కొండ పద్మ, కార్యదర్శిగా కలుపూరు జ్యోతి, సహాయ కార్యదర్శి తోట కుమారి, కోశాధికారిగా పెదపెంకి ఉమామహేశ్వరి, డైరెక్టర్లుగా ఎం.నాగమణి, కె.కల్యాణి, పి.సుమతి, ఎం.దేవి, వి.భవాని ఎన్నికయ్యారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు..

మందుబాబులకు రూ.11లక్షల జరిమానా

పార్వతీపురం రూరల్: గత రెండు నెలల్లో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 109 మంది వాహన చోదకులకు ఒకరికి రూ.10వేలు చొప్పున లోక్ అదాలత్ ద్వారా జరిమానా విధించినట్లు పార్వతీపురం పట్టణ సీఐ కె.మురళీధర్, ఎస్ఐ గోవింద శనివారం తెలిపారు. మొత్తంగా 109 మందికి రూ.11లక్షలు జరిమానాను విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల దృష్ట్యా మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అలా నడిపిన కారణంగా వారితో పాటు రోడ్డుపై తోటి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అవగాహనతో రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు.

ఐటీడీఏ బంక్‌లో పెట్రోల్ నిల్



సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో ఎప్పటికప్పుడు సరుకు నిండుకుంటోంది. శనివారం రోజంతా పెట్రోల్ లేకపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. తరచూ రెండు,మూడు రోజులకోసారి సరుకు ఉండడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్థానిక వ్యాపారులు కొత్తూరు వెళ్లి పెట్రోల్ తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి పెట్రోల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ప్రచార సభ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చీఫ్ సూపరింటెండెంట్ తోట శంకరరావు, హిందీ కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్‌కుమార్ పండాలు తెలిపారు. విశారద, భూషణ్, విద్వాన్ పరీక్షలకు 28 మందికి గాను 27 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

పరీక్షల నిర్వహణను ఎంఈవో సత్యనారాయణ తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని చెప్పారు.

రైతన్నకు కూటమి దగా

- అన్నదాత సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం
- రైతు సమస్యలపై ఎమ్మెల్యేకు అవగాహన లేకపోవడం విచారకరం
- విలేకరుల సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: రైతన్నను కూటమి ప్రభుత్వం దగా(మోసం) చేసిందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి విమర్శించారు. ఇదే విషయమై ఆమె మండలంలోని చినమేరంగి గ్రామంలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రస్తుతం యూరియా కోసం అన్నదాతలు అష్టకష్టాలు పడుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విలేకరుల సమావేశం నిర్వహించి, వైఎస్సార్ సీపీ హయాంలో రైతుకు ఏ లబ్ధి చేకూరలేదని, తమ కూటమి ప్రభుత్వంలోనే రైతులు సంతోషంగా ఉన్నారని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. జగనన్న హయాంలో ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేసి దానికి అనుబంధంగా రైతు సేవా కేంద్రాలను నెలకొల్పి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందివ్వడం జరిగిందని, ఈ విషయం ఏ రైతును అడిగినా చెబుతారన్నారు. ఎండనకా, వాననకా రైతులు రోడ్లు మీదికి వచ్చి పడుతున్న కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతు సమస్యలను ఎలాగో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లలేరు..కనీసం రైతుల కష్టం గుర్తించాలని హితవుపలికారు. ఒక్క జియ్యమ్మవలస మండలంలో 15 వేల ఎకరాలకు 2,600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైనప్పటికీ అధికారులు కేవలం 1200 మెట్రిక్ టన్నులకు ఇండెంట్ పెట్టారని, అయితే 600 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందన్నారు.

ఒక రైతుకు ఒక బస్తా..

ఎరువులు ఇచ్చామని చెప్పుకోవడానికి ఒక్కో రైతుకు అవసరమైనన్ని బస్తాలు ఇవ్వకుండా ఒక్కో బస్తా ఇచ్చి చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. కొన్ని గ్రామాల్లోని రైతులకు అది కూడా ఇవ్వలేదన్నారు. కనీసం పంట నష్టం జరిగితే పరిహారం కూడా ఇవ్వడం లేదన్నారు. అదే వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా కేవలం అరటి పంటకు నష్టపరిహారం కింద రూ.19 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది టీడీపీ కార్యకర్తలే ఉన్నారన్నారు. ఎరువుల కొరతపై రాష్ట్ర వ్యాప్తంగా గందరగోళ వాతావరణం నెలకొనగా మీ ఈనాడు పత్రికలో ఎరువుకు కరువు అన్న వార్త కూడా వచ్చిందని, ఈ విషయంపై కనీస అవగాహన లేకుండా ఎమ్మెల్యే జగదీశ్వరి రైతులంతా సంతోషంగా ఉన్నారని మాట్లాడడం సరికాదన్నారు. రైతు సమస్యలపై ఇప్పటికీ అవగాహన లేకపోవడం విచారకరమన్నారు. ఈవీఎం ఎమ్మెల్యే కదా ఇలాంటి సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చని ఎద్దేవా చేశారు. ప్రజలు మీకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నియోజకవర్గం రైతు సమస్యలతో పాటు అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భద్రగిరి, చినమేరంగి, కురుపాం ఆస్పత్రుల్లో సిబ్బంది లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తే మీకు ప్రజలు ఓట్లేసి గెలిపించారని అర్థమవుతుందని, లేకుంటే ఈవీఎం ఎమ్మెల్యేగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మునిగిన పంట పొలాలు



వీపీ రాజుపేట సమీపంలో నీట మునిగిన వరి

పాలకొండ రూరల్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. మండల పరిధిలోని జంపరకోట, వీపీ రాజుపేట, తంపటాపల్లితోపాటు శివారు గ్రామాల్లోని పంట పొలాల్లో వరద నీరు చేరింది. దీంతో పొలాల్లోని నీటిని తరలించే పనుల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు. అలాగే పాలకొండ – వీరఘట్టం రహదారిపైకి నీరు చేరడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే ఏఓ ప్రసాద్ మాట్లాడుతూ.. పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపిస్తే ఇబ్బందులుండవని చెప్పారు. బూస్టర్ డోస్‌గా యూరియా మరోసారి వేయాలని సూచించారు.

లోక్ అదాలత్ విజయవంతం



కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి హరిప్రియ

పాలకొండ రూరల్: పట్టణంలోని న్యాయస్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ విజయవంతమైంది. ఈ సందర్భంగా న్యాయమూర్తి చందక హరిప్రియ 339 కేసులకు పరిష్కారం చూపారు. అలాగే అపరాధ రుసుం కింద రూ. 11 లక్షలు ప్రభుత్వ ఖజానాకు జమయ్యేలా తీర్పు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు ఉత్తరావిల్లి మురళీమోహనరావు, శ్రీనివాసరావు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

17 నుంచి విశ్వకర్మ జయంత్యుత్సవాలు



సమావేశమైన విశ్వబ్రాహణ స్వర్ణకార సేవా సంఘ ప్రతినిధులు

పాలకొండ రూరల్:

ఈ నెల 17 నుంచి 19 వరకు స్థానిక కోమటిపేట సమీపంలో గల శ్రీ సనారి విశ్వేశ్వరస్వామి ధాన్య మందిరంలో విశ్వకర్మ జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సేవా సంఘ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం సంఘ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు టేకి ప్రసాదరావు ఆచారి మాట్లాడుతూ.. ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ఆర్‌డీవలసలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో గోపాలరావు

గరుగుబిల్లి: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు తెలిపారు. మండలంలోని పెదగుడబ, ఆర్‌డీవలస గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా ఇళ్ల వద్దకు వస్తున్న గ్రీన్ అంబాసిడర్‌లకు తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా అందించాలని తెలిపారు. ఇంటి ముంగిట మురుగునిల్వలు లేకుండా చూడాలని, తాగునీటి బోర్లు, రక్షిత మంచి నీటి పథకాల వద్ద క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు.

ప్రత్యేక మండలంగా ప్రకటించాలి

నీలకంఠాపురం ప్రజలు



మాట్లాడుతున్న సర్పంచ్ మన్మధరావు

కురుపాం: మండలంలోని నీలకంఠాపురాన్ని ప్రత్యేక గిరిజన మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన పలు గ్రామాల ప్రజలతో శనివారం సమావేశమై మాట్లాడారు. తూర్పుముఠా వైపు ఉన్న 12 పంచాయతీలకు చెందిన యువత, ప్రజలంతా ఈ ర్యాలీలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

క్షీణిస్తున్న పారిశుధ్యం



కోమటిపేట అంగనవాడీ కేంద్రం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

పాలకొండ రూరల్: నగర పంచాయతీలో పారిశుధ్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. పట్టించుకోవాల్సిన అధికారులు, పాలకులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఓ వైపు వర్షాలు, మరోవైపు క్షీణిస్తున్న పారిశుధ్యంతో పట్టణంలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. పట్టణంలోని కోమటిపేట, గొల్లవీధులు, రెల్లివీధి శివారు, వీవర్స్ కాలనీతో పాటు కొత్తవీధి, కస్పావీధి, కాపువీధుల్లో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరం..



నిత్యం వందలాది వాహనాలు మండల కేంద్రంలోని పాలకొండ – రాయగడ రహదారిలో గల గజాలాఖానా మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. దాదాపు పుష్కరకాలం కిందట నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. వంతెన పైభాగంలో చిన్న చిన్న రంధ్రాలు ఏర్పడడంతో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్

తోటపల్లికి పోటెత్తిన భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం ఉదయాన్నే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.